
ప్రజాశక్తి
శనివారం 4 అక్టోబర్ 2025



బొప్పాయి, అరటి పంటలు నేలమట్టం

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలో గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా బొప్పాయి, అరటి పంటలు నేలమట్టం అయ్యాయి. పెకి పాలవలస, పేరిపి గ్రామాల్లో ఎక్కువగా అరటి, బొప్పాయి సాగు చేశారు. పెకి పాలవలసలో 100 ఎకరాల్లో అరటి, 60 ఎకరాల్లో బొప్పాయి పండిస్తున్నారు. వర్షాల కారణంగా అరటి, బొప్పాయి పంటలు నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలిస్తున్నట్లు ఉద్యానశాఖాధికారి ఎం.అనూష తెలిపారు.



నేలకొరిగిన అరటితోటను పరిశీలిస్తున్న హెచ్ఒ అనూష



నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నది ఉధృతి

౧౧౫౫ ఎకరాల్లో పంట నష్టం


355 ఎకరాల్లో ఉద్యాన పంటలకు ముప్పు • నీట మునిగిన 333 ఎకరాల వ్యవసాయ పంటలు



వేపాడ మండలం కొత్తమారికలో నేలకొరిగిన వరిచేను

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ నెల 1వ తేదీ రాత్రి నుంచి 2వ తేదీ మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షాలకు, ఈదురుగాలులకు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు ముప్పువాటిల్లింది. అత్యధికంగా ఉద్యాన పంటలకు 822 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మరో 333 ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. ఇది వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల ప్రాథమిక అంచనా. భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా చెరువులు పూర్తిగా నిండిపోయాయి. పలు చోట్ల పొలాల గట్లు కూడా దెబ్బతిన్నట్లుగా సమాచారం. ఈదురుగాలులకు అత్యధికంగా 265 ఎకరాల్లో అరటి చెట్లు, మరో 84 ఎకరాల్లో బొప్పాయి మొక్కలు నేలకొరిగాయి. 8 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ పంటల విషయానికి వస్తే... వరి 219 ఎకరాల్లోనూ, మొక్కజొన్న 47 ఎకరాల్లోనూ పత్తి 68 ఎకరాల్లోనూ నీట మునిగింది. వరి అత్యధికంగా మెంటాడ మండలంలో 148ఎకరాల్లో నీట మునిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనావేశారు. ఉద్యాన పంటలు మొత్తంగా 44 గ్రామాల్లో 329 మంది రైతులు నష్టానికి గురయ్యారు. ఇందులో బొబ్బిలి మండలం కొత్తపెంట గ్రామంలోనూ, పూసపాటిరేగ, మెంటాడ మండలాల్లోనూ ఎక్కువ నష్టం జరిగినట్టు ఉద్యాన శాఖ గుర్తించింది. బొబ్బిలి మండలంలోని మూడు గ్రామాల పరిధిలో 154మంది రైతులు 85ఎకరాల్లో అరటి పంట నష్టపోయారు. పూసపాటిరేగ మండలంలో పది గ్రామాల పరిధిలో 52 ఎకరాల్లోనూ, మెంటాడ మండలంలో 52 ఎకరాలు, గంట్యాడ మండల పరిధిలోని ఆరు గ్రామాల్లో 22మంది రైతులకు చెందిన 23ఎకరాల్లో అరటి పంట నేలకొరిగింది. నెల్లిమర్ల మండలంలో 1.2 ఎకరాలు, చీపురుపల్లి మండలంలోని 2 రెండు గ్రామాల పరిధిలో 25ఎకరాలు, ఎస్.కోట పరిధిలోని రెండు గ్రామాల్లో ఐదు ఎకరాలు, గరివిడి మండలం బాగువలసలో 2.5ఎకరాల్లో నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు ఇప్పటికే పంటల బీమా పొందిన రైతులకు నష్టపరిహారం అందే అవకాశం ఉంటుంది. అయితే, ప్రతి ఎకరా విస్తీర్ణంలో 33శాతానికిపైగా నష్టం జరిగితేనే బీమా వర్తించే షరతు కూడా అమల్లో ఉంది. మరో రెండు రోజుల్లో మరింత ఖచ్చితమైన లెక్కలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.



భోగాపురం మండలంలో ఈదురుగాలులతో విరిగిన అరటి పంట

అంధకారంలో కలెక్టరేట్

బీభత్సంగా వీచిన ఈదురుగాలులకు కలెక్టరేట్ పరిధిలోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. దీంతో, 1వ తేదీ రాత్రి నుంచి విద్యుత్ అంతరాయం కలిగింది. 2వ తేదీన దసరా కావడంతో ప్రభుత్వ కార్యకలాపాలు జరగలేదు. శుక్రవారం ఉదయానికి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో వివిధ శాఖల ఆన్‌లైన్ కార్యకలాపాలు, నివేదికల తయారీ, ప్రింటు కాపీలు తీయడం వంటివాటికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. కనీసం లైట్లు వేసుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో కలెక్టరేట్‌లోని కార్యాలయాలన్నీ శుక్రవారమంతా అంధకారంలో ఉన్నాయి.

ఉప్పొంగిన నాగావళి


ప్రజాశక్తి- సంతకవిటి, రేగిడి

ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం నారాయణపురం ఆనకట్ట వద్దకు పైనుంచి 40 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోతోంది. వరద నీరు అధికంగా నదిలో చేరడంతో జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. సంతకవిటి తహశీల్దార్ బి.సుదర్శనరావు నాగావళి నది పరివాహక ప్రాంతాలను సందర్శించారు. కె.ఆర్.పురం, ఎస్.రంగరాయపురం, వాసుదేవపట్నం, తమరాం, చిత్తారిపురం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే 24 గంటల్లో నది ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకుంటోందని హెచ్చరికలు జారీ చేశారు. నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు హెచ్చరించారు. రేగిడి మండలం బొడ్డవలసలో అసంపూర్తిగా ఉన్న కరకట్టను తహశీల్దార్ ఐ.కృష్ణలత పరిశీలించి, గ్రామస్తులను అప్రమత్తం చేశారు. బొడ్డవలస, కొమెరి వెంకటాపురం, గదబపేట, ఖండ్యాం గ్రామాల్లో ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసి, ప్రజలకు టామ్‌టామ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తహశీల్దార్‌తో పాటు విఆర్ఒ దుర్గారావు ఉన్నారు.

నేలమట్టమైన వరిచేను

వేపాడ : ఏకధాటిగా కురిసిన వర్షంతో కరకవలస పంచాయతీ పరిధిలోని కొత్త మారికలో వరిచేను నేలమట్టమైంది. నష్టాన్ని అంచనా వేసి, రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ ప్రభుత్వాన్ని కోరారు.

కూలిన పాఠశాల భవనం



కూలిపోయిన పాఠశాల శిథిల భవనం

బొబ్బిలి : పట్టణంలోని టిఆర్ కాలనీలో ఉన్న పాఠశాల భవనం కుప్ప కూలింది. బాల పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో వినియోగించడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం నానడంతో కూలిపోయింది. ఆ సమయంలో పాఠశాలలో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులు, నదుల్లో స్నానాలకు దిగొద్దు

బొబ్బిలిరూరల్ : చెరువులు, నదులలో స్నానాలకు దిగవద్దని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కోరారు. మండలంలోని ఎం.బూర్జవలసలో శుక్రవారం యువతతో సమావేశం నిర్వహించారు. చెరువు, వేగావతి నదిలో స్నానానికి దిగి ఇద్దరు ఇప్పటికే మరణించారని తెలిపారు. వర్షాలకు చెరువులలో నీరు పుష్కలంగా ఉందని, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, స్నానాలకు దిగవద్దని కోరారు.

గాలివాన బీభత్సం

పలుచోట్ల నేలకొరిగిన చెట్లు



డెంకాడ.. ఈదురుగాలులకు విరిగి విద్యుత్ స్తంభంపై పడిన చెట్టు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని గురువారం ఉదయం గాలివాన బీభత్సం సృష్టించింది. ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో వైర్లు తెగిపడిపోయాయి. దీంతో మండలంలో గురువారం రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆ శాఖ సిబ్బంది స్తంభాలను సరిచేసి, గురువారం రాత్రికి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం పలుచోట్ల సిబ్బంది చెట్లను తొలగించి విద్యుత్ సరఫరా చేశారు. గాలివానకు చొల్లంగిపేటలో సుమారు 90 ఎకరాల వరకు వరిచేను నేలకొరిగింది. నేలకొరిగిన పంటను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్, వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణరావు, ఎఒ సంగీత పరిశీలించి, నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకరాజు, సూరి ప్రకాశరావు, చిన్నంనాయుడు, సూరిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి రామకోటి, విఎఎ షాలిని పాల్గొన్నారు.

దత్తిరాజేరు : మండలంలో గురువారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీవృక్షాలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో మరడాం, ఎస్.బూర్జవలస గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. గురు, శుక్రవారాల్లో విద్యుత్ సరఫరా లేక ప్రజలు అల్లాడిపోయారు. విద్యుత్ సిబ్బంది కిరణ్, శ్రీనివాస్ స్తంభాలపై పడిన చెట్లను తొలగించి, సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు.

గజపతినగరం : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాతబగ్గాం నుంచి కొణిశ జంక్షన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సమయంలో ఆ రహదారిపై ఎవరూ ప్రయాణం చేయకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్తులు గమనించి పాతబగ్గాం సర్పంచ్ ప్రతినిధి, టిడిపి సీనియర్ నాయకులు లెంక చిన్నం నాయుడుకు సమాచారం తెలియజేయగా వెంటనే ఆ చెట్టును తొలగించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రోడ్లపై చెట్లు పడిపోవడంతో కొన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లింగాలవలస, లోగిస, జిన్నాం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



గజపతినగరం.. రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

వర్షపాతం వివరాలు

గురువారం ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 1068 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సరాసరి 39.6 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా గరివిడిలో 88.6మి.మీ., గుర్ల 80మి.మీ. వర్షం కురవగా అత్యల్పంగా గజపతినగరం మండలంలో 11.4మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మండలం	వర్షపాతం(మి.మీ)
వంగర	57.0
రేగిడి	30.6
సంతకవిటి	34.6
రాజాం	38.8
బొబ్బిలి	36.8
రామభద్రపురం	36.8
బాడంగి	24.4
తెర్లాం	54.4
మెరకముడిదాం	51.2
దత్తిరాజేరు	47.6
మెంటాడ	40.8
గజపతినగరం	11.6
గరివిడి	88.6
చీపురుపల్లి	68.0
గుర్ల	80.0
బొండపల్లి	28.8
గంట్యాడ	40.2
ఎస్.కోట	18.2
వేపాడ	15.4
ఎల్.కోట	22.2
కొత్తవలస	22.4
జామి	18.6
విజయనగరం	31.4
నెల్లిమర్ల	66.8
పూసపాటిరేగ	33.4
డెంకాడ	34.4
భోగాపురం	35.4

అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రామసుందర్ రెడ్డి • నాగావళి పరీవాహక ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి-రేగిడి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. నాగావళి నదీ పరీవాహక ప్రాంతంలో ఆయన శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. రేగిడి మండలం బొడ్డవలస గ్రామం వద్ద నాగావళి నది నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. దిగువకు నీటి ప్రవాహం, దిగువనున్న గ్రామాలు, పంటల స్థితిగతులపై రెవెన్యూ అధికారులను ఆరా తీశారు. నదిని ఆనుకొని ఉన్న తాగునీటి పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒడిశాలో భారీ వర్షాల కారణంగా నాగావళి, వంశధార నదుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని అన్నారు. జిల్లాలో కూడా గత రెండు రోజులుగా భారీ వర్షాలు పడ్డాయని, ఇంకా కురిసే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల నదులు, వాగుల్లో నీటి ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట చీపురుపల్లి ఇన్చార్జి ఆర్‌డిఒ ఆశయ్య, తహశీల్దార్ కృష్ణలత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బొడ్డవలస వద్ద నాగావళి నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యుత్ శాఖకు రూ.20 లక్షలు నష్టం

ప్రజాశకి-విజయనగరం టౌన్

గురువారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి, వీచిన గాలులకు విద్యుత్ శాఖకు సుమారుగా రూ.20 లక్షలు వరకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేసారు. గాలులకు జిల్లాలో విజయనగరం, చీపురుపల్లి, విజయనగరం రూరల్, బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో 43 సబ్ స్టేషన్‌లు మరమ్మత్తులకు గురయ్యాయి. వెంట వెంటనే మరమ్మత్తులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చాఉ. 33 కెవి ఫీడర్స్ 29 మరమ్మత్తులకు గురి కాగా వాటిలో 28 ఫీడర్లను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. 33 కెవి లైన్లు 3.9 కిలోమీటర్లు పరిధిలో తెగిపోగా 3.7కిలోమీటర్లు పరిధిలో లైన్లు సరిచేశారు. 33 కెవి లైన్లో నాలుగు స్తంభాలు ఇరిగిపోగా వాటి స్థానంలో కొత్తవాటిని వేశారు. 11 కెవి ఫీడర్లు 43 మరమత్తులకు గురికాగా వాటిలో 39 పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చాఉ. మిగిలిన నాలుగు ఫీడర్లు వినియోగంలోకి తీసుకొని వచ్చేందుకు మరమ్మత్తులు చేపడుతున్నారు. ఈ నాలుగు డివిజన్లలో 89 విద్యుత్ స్తంభాలు నెలకొరగగా 46 స్తంభాలు వేశారు. మిగతా వాటిని వేసే పనిలో విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. 11 కెవి లైన్లు 3.90 కిలోమీటర్లు పరిధిలో తెగిపోగా, ఇప్పటి వరకు 1.20 కిలోమీటర్ల లైన్లు సరిచేశారు. ఎల్ టి లైన్ 6.20 కిలోమీట్లరు మేరా తెగిపోయింది. వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లు 242 గ్రామాల్లో 141491 కనెక్షన్లు డామేజ్ అవ్వగా వాటిలో 13,7834 సర్వీసులను పునరుద్దరించారు. జిల్లాలో వ్యవసాయ సర్వీసులు 2126 మరమ్మత్తులకు గురి కాగా వాటిలో 1991 సర్వీసులను పునరిద్దరించినట్లు విద్యుత్తుశాఖ ఎస్ఇ మువ్వల లక్ష్మణరావు తెలిపారు.

- చీపురుపల్లి నియోజకవర్గంలో గురువారం భారీ వర్షం కురిసింది. గాలులకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్తుశాఖకు నష్టం వాటిల్లింది. పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నినిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో మొత్తం 84స్తంభాలు కూలిపోయినట్లు విద్యుత్తుశాఖ ఎడి ఇ.రమణ తెలిపారు. కూలిన విద్యుత్తు స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు.



డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నిద్రిస్తున్న హెల్త్ సెక్రటరీలు

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద

హెల్త్ సెక్రటరీల ఆందోళన

ప్రమోషన్ల జాబితా ప్రకటించాలని డిమాండ్ •రాత్రి అక్కడే నిద్ర

ప్రజాశక్తి- కంటోన్మెంట్

గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలను ఎంపిహెచ్ఎ(ఎఫ్)లుగా ప్రమోషన్ జాబితా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి సచివాలయ హెల్త్ సెక్రటరీలు బైఠాయించారు. తమ సమస్యలను పరిష్కరించేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని కార్యాలయం గేటు ముందు కూర్చుని నిరసన తెలిపారు. గత ఆర్నెళ్లగా ప్రమోషన్లకు సంబంధించిన నోటిఫికేషన్ ఇచ్చి ప్రమోషన్ జాబితా ప్రకటించకుండా తాత్సారం చేస్తున్నారని ఇది కరెక్ట్ కాదని పేర్కొన్నారు. ధర్నానుద్దేశించి యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.మాధవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివిరమణ మాట్లాడుతూ గ్రామవార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు 166 మందికి ఎంపిహెచ్ఎ(ఎఫ్)లుగా ప్రమోషన్ అవకాశం ఉందని నోటిఫికేషన్ జారీ చేశారన్నారు ఆరేళ్లుగా తిప్పుతున్నారు తప్ప ప్రమోషన్ లిస్ట్‌ను ప్రకటించలేదన్నారు. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తాత్సారం చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రమోషన్ జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అధికారులు స్పందించకపోవడంతో రాత్రంతా అక్కడే నిద్రించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్‌రావు, హెల్త్ సెక్రటరీలు కరణం శాంతి, సిరికి సంతోషి, డి.రత్నకుమారి, శంకరమ్మ, డి.చాముండేశ్వరి, కాత్యాయని, శ్రీదేవి శాంతి, భారతి, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల దీక్షలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన భూమిని తిరిగివ్వాలని కోరుతూ బొడ్డవరలో నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. గురువారం విజయదశమి రోజు కూడా యథాతథంగా దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ నిరుపేదల రైతుల నుంచి కంపెనీ పేరుతో భూమి దోచుకుని పరిశ్రమ కట్టకుండా అదే భూమిని ఇతర అవసరాలకు అమ్ముకునేందుకు చూస్తున్నారని ధ్వజమెత్తారు. జిందాల్ యాజమాన్యం మోసాలకు వ్యతిరేకంగా నిర్వాసితులు చేపట్టిన పోరాటానికి మద్దతుగా నిలబడతామని చెప్పారు.

ఘనంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి
- ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చించిన ఎమ్‌పి, ఎమ్మెల్యే
- పంట నష్టాలను అంచనా వేయాలి : ఎమ్‌పి



ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాల ఏర్పాట్ల పై పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక శాసన సభ్యులు పూసపాటి అదితి గజపతి రాజు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ని కలెక్టర్ ఛాంబర్ లో కలిసి ఉత్సవాల పై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన అన్ని వేదికల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వెన్యూ ఇంచార్జ్ అధికారులంతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అమ్మవారి గుడి నుండి బొంకుల దిబ్బ వరకు నిర్వహించే ర్యాలీని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత హాజరై, ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజా ప్రతినిధులంతా ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని కలెక్టర్ కోరారు. బొంకుల దిబ్బ వద్ద ప్రారంభమైన తర్వాత మిగిలిన అన్ని వేదికల్లో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. భారీ వర్షాలకు దెబ్బ తిన్న పంటల నష్టాలను వేగంగా అంచనా వేసి పూర్తి స్థాయి నివేకను ప్రభుత్వానికి పంపాలని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు కలెక్టర్‌ను కోరారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలను, చెరువు గట్లను వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు.

5న పెట్‌షో

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అయోధ్య మైదానంలో పెట్‌షో నిర్వహించనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వేదికలను పరిశీలించిన జెసి

ఉత్సవాలకు ముస్తాబవుతున్న వేదికలను సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ తనిఖీ చేశారు. వేదికల వద్ద చేస్తున్న ఏర్పాట్లను వేదికల ఇంచార్జ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఉత్సవాల నిర్వహణకు పటిష్ట భద్రత

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

కంటోన్మెంట్ : ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించే విజయనగరం ఉత్సవాలు, 6, 7 తేదీల్లో నిర్వహించే పైడితల్లమ్మ పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా, పటిష్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. శుక్రవారం ఉత్సవాలు, తొలేళ్ళు, సిరిమానోత్సవం సందర్భంగా క్షేత్ర స్థాయిలో భద్రత ఏర్పాట్లును పరిశీలించేందుకు పట్టణంలోని అయోధ్య మైదానం, కోట ప్రాంగణాన్ని పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు. సాంస్కతిక కార్యక్రమాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బ్యారికేడ్లును ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. వాహనాల పార్కింగు చేసేందుకు ప్రత్యేకంగా పార్కింగు స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే అయోధ్య మైదానం, సిరిమాను సంభరాన్ని ముఖ్య అతిథులు వీక్షించే కోట బురుజు వద్ద భద్రత ఏర్పాట్లును పరిశీలించారు. ఎస్‌పి వెంట ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐలు ఆర్.వి.ఆర్.కే.చౌదరి, టి.శ్రీనివాసరావు, సిహెచ్.సూరి నాయుడు, బి.లక్ష్మణరావు, రిజర్వు ఇన్స్పెక్టర్లు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్. టి. శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు ఉన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దసరా ఉత్సావాలు సందర్భంగా బాడీ ఫిటినెస్ జిమ్ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిరహించారు. విజేతలకు శుక్రవారం మెడల్స్ అందజేశారు. పోటీలో కె.యశ్వంత్, జి.వాసు, ఎ.శ్యామ్, ఎమ్. వెంకటేష్, ఎ.సాయి, దినేష్, రాము, డి.రమణ, బి.కిరణ్, బి.వాసు, బి.యశ్వంత్, హరీష్ విజేతలుగా నిలవగా ఎం.వెంకటేష్ ఓవరాల్ ఛాంపియన్ గెలుపొందారు. ఈ సందర్భంగా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కోడి రామ్మూర్తి స్ఫూర్తితో నేటి యువత డ్రగ్స్, గంజాయ్ లాంటి దురలవాట్లకు దూరంగా ఉండేందుకు బాడీ బిల్డింగ్ ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

ఐసిడిఎస్ పీడీ విమలారాణి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల పోర్ట్ సెక్టార్ సంజీవయ్య కాలనీ, బొగ్గులదిబ్బ-3 అంగన్వాడీ సెంటర్‌లను ఐసిడిఎస్ పీడీ టి.విమలా రాణి శుక్రవారం సందర్శించారు. ఫ్రీ స్కూల్ కార్యక్రమాలు, స్టాకులు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పిల్లలకు రోజూ పెట్టే మెనూ ప్రకారం ఫుడ్‌ను పరిశీలించారు. డోనర్ చంద్రకళ ఇచ్చిన యూనిఫామ్‌లను పిల్లలకు పంపిణీ చేశారు. స్టాక్ లో తేడాలు లేకుండా చూసుకుని ఎప్పటికప్పుడు లబ్దిదారులను పిలిపించి ఇవ్వాలన్నారు.

డిసిసిబి మీ సొంత జాగీరు కాదు

డిసిసిబి చైర్మన్ నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

డిసిసిబి మీ సొంత జాగీరు కాదని, అహంకార ధోరణి పనికిరాదని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున.. శాసనమండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అన్నారు. పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాన్ని డిసిసిబి నుంచి వీక్షించేందుకు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ రెండు జిల్లాల అధికారులకు లేఖ పంపారని, ఇది ఎలా సాధ్యమని నాగార్జున ప్రశ్నించారు. శుక్రవారం డిసిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొత్స సత్యనారాయణ డిసిసిబిలో ఏర్పాట్లు చేయాలని కోరుతున్న విషయం ఆశ్చర్యం కలుగుతుందన్నారు. డిసిసిబి అనేది ప్రభుత్వ రంగ సంస్థ అనే విషయం బొత్స మరచి పోయారా? అని ప్రశ్నించారు. శాసనమండలిలో బొత్స సత్యనారాయణ వ్యవస్థలు గురించి, పలు విషయాలపై మాట్లాడుతున్నారని, డిసిసిబి ప్రైవేట్ స్థలం కాదు, ప్రభుత్వ స్థలం అనే విషయం మరిచిరా అని ప్రశ్నించారు.

డిసిసిబి చైర్మన్‌గా తాను, డిసిఎంఎస్ చైర్మన్‌గా గొంప కృష్ణ, జిల్లాలో 94 ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు, డిసిసిబి అధికారులంతా పైడిమాంబ సిరిమానోత్సవాన్ని డిసిసిబి నుంచి వీక్షించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. డిసిసిబి ప్రస్తుతం కూటమి ఆధ్వర్యంలో ఉందని, ఈ విషయం ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మరచిపోయారా? అంటూ ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అహంకార ధోరణితో కాకుండా, ఈ విషయాన్ని రాజకీయం చేయకుండా హుందాగా వ్యహరించాలని సూచించారు. వైసిపి గ్రామ స్థాయిలో కార్యకర్తలును తీవ్ర ఇబ్బందులుకు గురి చేశారన్నారు. టిడిపి కార్యకర్తలంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలను, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అక్రమంగా తొలిగించిన విషయం మరిచిపోయారా? అని నిలదీశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేట్‌పరం తగదు

మాజీ ఎమ్‌పి బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బొత్స

గజపతినగరం : మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పిపిపి విధానం పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం శోచనీయమని, మెడికల్ కళాశాలలకు పేద కుటుంబాల పిల్లలను దూరం చేస్తూ బంగారు కుటుంబాలు పేరుతో పేదవారికి ఏదో చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేస్తున్నారని అన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలకు ఏడు మెడికల్ కాలేజీలు ప్రారంభించి వాటిలో క్లాసులు జరగుతుండగా ప్రైవేటుపరం చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మిగిలిన 10 మెడికల్ కాలేజీలకు 5000 కోట్లు ఇస్తే మెడికల్ విద్యకు అందుబాటులో వస్తాయని అన్నారు. వాలంటీర్లతో పించన్లు పంపిణీ చేయాల్సింది పోయి కోట్లు ఖర్చుపెట్టి సిఎం పంపిణీ చేయడం ప్రజాధనాన్ని వృథా చేయడమేనని విమర్శించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, జెడ్‌పిటిసి గార తౌడు, మండల నాయకులు కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, ఎంపిటిసి గేదెల జగదీష్ పాల్గొన్నారు.



సరస్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్

సరస్‌ను పరిశీలించిన డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్)ను శుక్రవారం డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి తెలిపారు. ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్‌తో కలసి ప్రతీ స్టాల్‌ను సందర్శించి వ్యాపారుల సేల్స్, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ చిరు వ్యాపారులకు మార్కెటింగ్ అవకాశాలు విస్తృతంగా కల్పించడం, మహిళలకు ఆర్థిక భద్రత కల్పించడం కోసం ఈ సరస్ జరుగుతుందని అన్నారు. ఆయనతో పాటు ఎపిడి కె.సావిత్రి, ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, డిపిఎం రాజ్‌కుమార్, రవికుమార్, చిరంజీవి, స్త్రీ నిధి ఎజిఎం చిట్టి బాబు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడండి

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. పాతబొబ్బిలి రోడ్డులో టిబిఆర్ థియేటర్ సమీపంలో రోడ్డుపైకి నీరు చేరింది. నీరు రోడ్డుపైకి రాకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళిని కమిషనర్ ఆదేశించారు. జెసిబితో నీరు రోడ్డుపైకి రాకుండా చేశారు.



రోడ్డుపైకి చేరిన వర్షపునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

రీసర్వేపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలో పోరాం గ్రామంలో శుక్రవారం రీసర్వేపై అవగాహన ర్యాలీని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో తహశీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ గ్రామ సరిహద్దులు, జిరాయతీ, గ్రామకంఠం, అసైన్డ్, పోరంబోకు భూములను సర్వేయర్ల బృందం గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జిబి బాస్కరరావు, పెదమేడపల్లి ఎంపిటిసి రెడ్డి ఎర్నాయుడు, పోరాం మాజీ సర్పంచ్ కుంచు వెంకటరమణ, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు పాల్గొన్నారు.

వెల్దాంలో రీ సర్వే

వేపాడ : మండలంలోని వీలుపర్తి గ్రామ రెవెన్యూ పరిధిలోని వెల్దాం గ్రామంలో శుక్రవారం సమగ్ర భూరీసర్వే ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సేనాపతి అప్పారావు, విఆర్ఒ శ్రీనివాసరావు, సర్వేయర్, విఆర్ఎ రాము పాల్గొన్నారు.

వైసిపి బూత్ కమిటీ అధ్యక్షులుగా కాంతారావు

ప్రజాశక్తి - గరివిడి

వైసిపి మండల బూత్ కమిటీ అధ్యక్షులుగా శివుకు కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైసిపి మండల అధ్యక్షులు మీసాల విశ్వేశ్వరరావు అధ్యక్షతన మండల స్థాయి బూత్ కమిటీ సమావేశాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి గుడివాడ శ్రీరాములు, లెంక శ్రీరాములు, పొన్నాడ కుమార్, కడుముల రాంబాబు, బమ్మిడి కార్తీక్, పచ్చిపల్లి కుమార్, బొంపల్లి వెంకట్రావు, కె.కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో శుక్రవారం ఎఒ ఎం.స్వాతికుమారి అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సహ చట్టంతో ప్రయోజనాలను, ఉపయోగించే తీరును ఆమె వివరించారు. ఈ సదస్సులో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించండి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగర ఉత్సవాలు పోలీసుశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఘనంగా నిర్వహించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బబ్జి ఎస్‌పి ఎఆర్ దామోదర్‌ను కోరారు. నూతన ఎస్పీ గా బాధ్యత తీసుకున్న దామోదర్‌ను పౌరవేదిక బృందంతో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు ఈ సందర్భంగా భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు,వర్కింగ్ ప్రెసిడెంట్ పిడకల ప్రభాకరరావు, తుమ్మగంటి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దళిత రత్న డాక్టర్ పాకా రాజారావు పేదల, పీడిత దళిత గిరిజనుల హక్కుల కోసం పనిచేశారని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొగిశ రామకృష్ణ అన్నారు. శుక్రవారం రింగురోడ్డు వెంకటేశ్వర స్వామి గుడిరోడ్‌లో ఉన్న రాజారావు విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు,చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు పట్టణ అధ్యక్షులు బెల్లాన.రాజారావు, కార్యదర్శి పొట్నూరు రమణ, మహిళా అధ్యక్షురాలు సిమ్మల శోభారాణి, కార్యదర్శులు టొంపల నాగమణి, అదపాక రమణమ్మ, దమరసింగి. రామరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-డెంకాడ

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దవళంపేట ప్రధాన కూడలిలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని ఆయన ఖండించారు. అంబేద్కర్ విగ్రహాలకు కూడా రక్షణ కరువైపోయిందని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వ విఫలమైందని విమర్శించారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారికి తగిన శిక్ష వేయాలని డిమాండ్‌చేశారు.



శ్రీనివాసరాజు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్‌పి కలిశెట్టి, కర్రోతు బంగార్రాజు

ఘనంగా కాకర్లపూడి షష్టిపూర్తి వేడుకలు

ప్రజాశక్తి-భోగాపురం

జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఎఎంసి మాజీ చైర్మన్ కాకర్లపూడి శ్రీనివాసరాజు షష్టిపూర్తి వేడుకలు ఘనంగా జరిగాయి. తన ఇంటి వద్ద అభిమానుల సమక్షంలో శ్రీనివాసరాజు భారీ కేక్ కట్ చేశారు. సుమారు 2000 మంది మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. శ్రీనివాసరాజు పుట్టినరోజు వేడుకల్లో ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, టిడిపి రాష్ట్ర నాయకులు మహంతి చిన్నంనాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, కర్రోతు సత్యనారాయణ, చనుమల్లు వెంకటరమణ, తుమ్మి లక్ష్మి రాజ్ పాల్గొని, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాకు 2 స్వచ్ఛాంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డులు

జిల్లా స్థాయి అవార్డులు 48 ● 6న ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కంటోన్మెంట్

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు, 48 జిల్లాస్థాయి అవార్డులు వచ్చాయని కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం గాంధీ జయంతి వేడుకలు అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ తగ్గింపు, సుస్థిర పద్ధతులు వంటి ప్రమాణాలపై నిర్వహించిన రేటింగ్ ఆధారంగా అవార్డుల ఎంపిక చేశారని తెలిపారు. అందులో స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు విభాగంలో ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం, స్వచ్ఛ మున్సిపాలిటీలు విభాగంలో (50 వేల నుండి ఒక లక్ష జనాభా) బొబ్బిలి మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక కాగా జిల్లాస్థాయి అవార్డులకు 48 మంది ఎంపికయ్యారని కలెక్టర్ వివరించారు. అవార్డులకు ఎంపికైన వారందరికీ ఈనెల 6న ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాస్థాయి అవార్డులలో బెస్ట్ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్లుగా బాడంగి మండలం తెంటువలస పంచాయతీ నుండి బి.భీమయ్యదాసు, విజయనగరం మండలం చెల్లూరు పంచాయతీ జి.అప్పన్న, చీపురుపల్లి మండలం కర్లాం పంచాయతీ నుండి బి. అప్పలస్వామి, ఎల్ కోట మండలం పోతంపేట పంచాయతీ నుండి బోర దేముడు, గజపతినగరం మండలం గజపతినగరం పంచాయతీ నుండి డి.మహంకాళి ఎంపిక కాగా బెస్ట్ స్వచ్ఛత ఎన్జీవోగా స్పార్క్ సొసైటీ ఎంపికైందని కలెక్టర్ తెలిపారు. బెస్ట్ స్వచ్ఛత వారియర్స్‌గా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుండి అడ్డాకుల కృష్ణారావు, దశమంతుల భాస్కరరావు, బొబ్బిలి మున్సిపాలిటీ నుండి బంగారి నాగరాజు, రాజాం మున్సిపాలిటీ నుండి పడాల వెంకటి, నెల్లిమర్ల మున్సిపాలిటీ నుండి పి.పైడిరాజు ఎంపిక కాగా స్వచ్ఛ అంగన్వాడీలుగా భూసాయ వలస, గొల్లల వలస, జామి, మదనాపురం, రాకోడు అంగన్వాడీ కేంద్రాలు ఎంపికయ్యాయని తెలిపారు. స్వచ్ఛ బస్ స్టేషన్‌గా రాజాం బస్ స్టేషన్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం గా బొబ్బిలి సబ్ ట్రెజరీ ఆఫీస్ ఎంపికయ్యాయని తెలిపారు.

స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా బాడంగి మండలం ఆకులకట్ట, బొండపల్లి మండలం అంబటివలస, విజయనగరం మండలం ద్వారపూడి, భోగాపురం మండలం నందిగామ, గజపతినగరం మండలం తుమికాపల్లి ఎంపిక అయ్యాయని, స్వచ్ఛ ఆస్పత్రులుగా పూసపాటిరేగ పిహెచ్‌సి, రాజాం ఏరియా ఆసుపత్రి, గరివిడి పిహెచ్‌సి ఎంపికయ్యాయని తెలిపారు. స్వచ్ఛ హాస్టల్స్‌గా పెరుమాలి సాంఘిక సంక్షేమ బాయ్స్ హాస్టల్, చీపురుపల్లి బిసి కాలేజ్ గర్ల్స్ హాస్టల్, బొబ్బిలి జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాల ఎంపికైనట్లు తెలిపారు.

స్వచ్ఛ ఇండస్ట్రీస్ విభాగంలో ఎస్ఎంఎస్ ఫార్మాసిటికల్స్, ధనిక ఆక్వా ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మహి ఎడిబుల్ ఆయిల్స్ ఎంపికయ్యాయని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్‌గా వేపాడ గురుకులం, స్వచ్ఛ రైతుబజార్‌గా ఎస్.కోట రైతుబజార్ ఎంపికయ్యాయని తెలిపారు. స్వచ్ఛ స్కూల్స్ విభాగంలో రంగరాయపురం ఎంపిపి స్కూల్, కొత్తపేట స్వామి వివేకానంద ఎంపిపి స్కూల్, కుమరాం కేజీబీవీ, కొట్టక్కి జడ్‌పి హైస్కూల్, కొత్తవలస అర్ధన్నపాలెం ఎపిఎంఎస్ ఎంపికయ్యాయి. స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్లుగా విజయనగరం మండలం ద్వారపూడి, గజపతినగరం మండలం కాలం రాజుపేట, బాడంగి మండలం ముగడ, డెంకాడ మండలం పినతాడివాడ, గుర్ల మండలం పోలాయవలస ఎంపికయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వారందరికీ అభినందనలు తెలిపారు.

కుక్కలదాడిలో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శ్రీహరిపురంలో శుక్రవారం కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలయ్యాయి. తెల్లవారి 4గంటల నుంచి కనిపించిన వారిపట్ల క్రూరంగా ప్రవర్తిస్తూ దాడి చేశాయి. ఒక మహిళపై దాడి చేసి బట్టలు కూడా చింపేశాయి. శ్రీహరిపురం ఆర్ ఆర్ కాలనీలో మరో ఐదుగురికిపై దాడి చేసి గాయపరిచాయి.

ప్రజా దర్బార్‌లో వినతులు

విజయనగరం కోట : స్థానిక అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

డిసెంబర్ 13న జాబ్‌మేళా

విజయనగరంకోట : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం యువతి యువకులకు సంబంధించి డిసెంబర్ 13న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు టివిఎస్. శ్రీనివాస్, జాబ్ మేళా రాష్ట్ర కో కన్వీనర్ రవి మండ తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక గాజులరేగ రోడ్డు ఇంస్ప్రో స్కూల్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గుంటూరు హిందూ కాలేజీ అఫ్ ఫార్మసీలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఈ మేళాలో 50కు పైబడి కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. నవంబర్ 22లోగా దరఖాస్తు చేయాలన్నారు.

ఆర్‌జిఎస్ఎ ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి-భోగాపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జిఎస్ఎ) కార్యాచరణ ప్రణాళికపై ఏర్పాటుచేసిన శిక్షణను ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి ప్రారంభించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి సొంత వనరుల సద్వినియోగం అత్యంత ముఖ్యమన్నారు. ఆర్‌జిఎస్ఎ ప్రణాళిక ద్వారా పంచాయతీలు మరింత ఆర్థికంగా బలపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ స్వరూపారాణి పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సొంతంగా ఆదాయ మార్గాలను సమకూర్చుకోవడంపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, ఎఒ మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్తు శాఖ నిర్లక్ష్యం

- విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృత్యువాత
- ఆగ్రహించిన గ్రామస్తులు
- రూ.4లక్షలు పరిహారం ఇచ్చేందుకు అధికారుల హామీ

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని చిట్టాయవలసలో పాడి రైతు లెంక శ్రీనుకు చెందిన సుమారు 8 లక్షలు విలువ చేసే 5 గేదెలు శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. ఆ గేదెలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతు శ్రీను ఈ ఘటనతో కన్నీరుమున్నీరయ్యాడు. విద్యుత్తుశాఖ నిర్లక్ష్యం వల్లే గేదెల చనిపోయాయని, గత కొన్నిరోజులుగా కిందకు వేలాడుతున్న విద్యుత్తు వైర్లను సరిచేయాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందంటూ గ్రామస్తులంతా నిరసన తెలిపారు. శుక్రవారం ఉదయం మెంటాడ రోడ్డు కు పక్కనే ఉన్న లేఔట్ లో గేదెలను పశు గ్రాసం కోసం మేతకు తీసుకుని రైతు శ్రీను వెళ్లాడు. విద్యుత్ తీగ తెగి పడటంతో గేదె దూడకు తగిలి షాక్‌కు గురైంది. ఆర్తనాదాలు పెడతూ పెద్దగా అరుస్తూ చనిపోయింది. దీంతో సమీపంలో ఉన్న దూడ తల్లి, మిగతా గేదెలు పరుగులు తీస్తూ అక్కడికి వెళ్లాయి. అవి కూడా షాక్‌కు గురై ఒక దాని తర్వాత మరొకటి వరుసగా ఐదు నిమిషాల వ్యవధిలోనే మృతి చెందాయి. ఈ ఘటన బాధిత కుటుంబంతోపాటు, గ్రామస్తులు, అటుగా వెళ్లే ప్రయాణికులను కంటతడి పెట్టించింది. మూగ జీవులైనప్పటికీ చావు బతుకుల్లో ఉన్న తమ తోటి గేదెను కాపాడుకునేందుకు వెళ్లి మృతి చెందడం వాటిలోనూ మానవత్వాన్ని ప్రతిబింబించింది. దీంతో గ్రామంలో ఉన్న యువతతో పాటు, పలువురు నాయకులు పార్టీలకు అతీతంగా స్పందిస్తూ... గత మూడు నెలలుగా విద్యుత్ అధికారులకు వేలాడుతున్న విద్యుత్ తీగలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ తమ సమస్యను పట్టించుకోకపోవడంతో నేడు 5 మూగ జీవులు ప్రాణాలు బలి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి నాలుగు గంటలు గడుస్తున్నా కనీసం విద్యుత్ ఎఇ, ఎడిఎ సంఘటన స్థలానికి రాలేదని పలువురు గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ విషయాన్ని పలువురు నాయకులు విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లి నిలదీయడంతో సాయంత్రం ఐదు గంటల సమయానికి ఎడిఎ శివకుమార్, ఎఇ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గేదలను పరిశీలించి రూ.50వేలు పరిహారం చెల్లిస్తామని చెప్పారు. గ్రామస్తులంతా వ్యతిరేకించడంతో చేసేదేమీ లేక ఉన్నతాధికారు లతో మంతనాలు చేసి కొద్దిసేపటి తరువాత నాలుగు లక్షలు పరిహారం చెల్లించడానికి అంగీకరించారు. తక్షణమే రూ.లక్ష ఇవ్వడానికి, వచ్చే రెండు నెలల్లో మిగిలిన సొమ్ము ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే సమయంలో పలువురు యువత గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన రెండు పోల్స్ శిథిలా వ్యవస్థలో ఉన్నాయని, తమ గ్రామానికి ప్రమాదం జరిగితే విద్యుత్ నిలిపివేయడానికి కొత్త బగ్గాం వెళ్ళవలసి వస్తుందని, ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించడంతో సమస్యను త్వరలోనే పరిష్క రిస్తామని ఎడి శివకుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విఆర్ఒ రాజేష్, పశు వైద్యాధికారి అవినాష్, కొత్తబగ్గాం, పాతబగ్గాం గ్రామాల పెద్దల పల్లి సంజీవ్, లెంక చిన్నం నాయుడు, చిట్టాయవలస గ్రామపెద్దలు బొత్స రమణ, సిరిపురపు సాయి, మోహన్, సూర్యనారాయణ, దేవుడు పలువురు నాయకులు ఉన్నారు.



విద్యుత్తు శాఖ ఎడి శివకుమార్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

వ్యాపారులకు అండగా ఉంటా : కళా

ప్రజాశక్తి-చీపురుపల్లి

వ్యాపారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం చీపురుపల్లిలోని వైశ్య వర్తక సంఘం భవనంలో జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 99 రకాల వస్తువులపై జిఎస్‌టి తగ్గడం శుభ పరిణామమని, దీంతో సామాన్యులకు లాభమని తెలిపారు. జిఎస్‌టి తగ్గడంతో కొనుగోళ్లు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం కూడా గణనీయంగా పెరుగుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విజిలెన్స్ దాడులు లేకపోవడంతో ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. వ్యాపారులపై ఈగ వాలినా తాను ఊరుకోనని అన్నారు. అనంతరం కళావెంకటరావును వ్యాపారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళింగ కోమటి సంక్షేమ సంఘం అధ్యక్షులు పొట్నూరు నర్సింగరావు, మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, టిడిపి నాయకులు కె త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, జనసేన నాయకులు కోట్ల కృష్ణ, విసినిగిరి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు ఇప్పిలి నీలకంఠం, వ్యాపారులు తంగుడు రామకృష్ణ, అంధవరపు హరి, ఎంపిడిఒ ఐ.సురేష్, తహశీల్దార్ డి.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

తిరుపతిరావుకు ఉత్తమ విలన్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళల కాణాచి తెనాలిలో జాతీయ స్థాయిలో జరిగిన పౌరాణిక పద్యనాటక పరిషత్‌లో మన విజయనగరం నుంచి అక్కినేని సాంస్కృతిక సమాజం విజయనగరం వారి మోహినీ భస్మాసుర పద్య నాటకంలో భస్మాసురుడు క్యారెక్టర్‌గా వేసిన దాసరి తిరుపతినాయుడుకు ఉత్తమ విలన్ అవార్డు లభించింది. ద్వితీయ ప్రదర్శన కింద రూ.75వేలు నగదు బహుమతి లభించింది.

జిఎస్‌టి తగ్గింపుతో రైతులకు లాభం



బొబ్బిలిరూరల్.. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

జిఎస్‌టి తగ్గించడంతో రైతులకు లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మండలంలోని కొత్తపెంటలో శుక్రవారం జిఎస్‌టిపై రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపుతో వ్యవసాయ పనిముట్ల ధరలు బాగా తగ్గాయని చెప్పారు. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ పరికరాల ధరలు బాగా తగ్గడంతో రైతులకు లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో ఎఒ మజ్జి శ్యామసుందర్, ఉద్యాన శాఖాధికారి రత్నం పాల్గొన్నారు.

గంట్యాడ : జిఎస్‌టి తగ్గింపు వల్ల రైతులకు ఎన్నో లాభాలని, ఎంతో డబ్బులు ఆదా అవుతాయని ఆగ్రో డిఎం పి.చంద్రశేఖర్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, సర్పంచులకు ఏర్పాటుచేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సూపర్ జిఎస్‌టి లాభాలు గురించి వివరించారు. జిఎస్‌టి సేవింగ్స్‌పై గంట్యాడలో పంచాయతీ కార్యదర్శులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.రాములమ్మ, ఎఒ బి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

వేపాడ : జిఎస్‌టి తగ్గింపుతో లాభాలపై దబ్బిరాజుపేటలో ర్యాలీ అవగాహన చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు, పరికరాలపై జిఎస్‌టి తగ్గడంతో రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ట్రాక్టర్లు కొనుక్కుంటే రూ.21 వేల నుంచి 85 వేల వరకు ట్రాక్టర్ మోడల్ బట్టి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎఒ స్వాతికుమారి, ఎఇఒ అక్కునాయుడు, ఎంపిఇఒ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : సూపర్ జిఎస్‌టిపై ప్రతీ కొనుగోలుదారుకు అవగాహన ఉండాలని వాణిజ్య పన్నుల శాఖాధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు ఎంతో భారం తగ్గిందన్నారు. రైతులకు ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, స్పింక్లర్లు వంటి యంత్ర పరికరాలపై జిఎస్‌టి భారీగా తగ్గిందన్నారు. ఈ సమావేశంలో డిఎల్‌డిఒ కిరణ్ కుమార్, ఎంపిడిఒ రత్నం పాల్గొన్నారు.

సంతకవిటి : బొద్దూరులో సూపర్ జిఎస్‌టి – సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ కె.సురేష్ కుమార్ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిఎస్‌టి అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వేపాడ.. మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

నేరాలు ఘోరాలు

కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని కొత్తసుంకరపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బలిఘట్టం గ్రామానికి చెందిన తమడపు రాము (52) తోటి కార్మికులతో అల్ట్రాటెక్ కంపెనీకి చెందిన లేబర్ కాలనీలో హౌస్ కీపింగ్ పనికి గురువారం ఉదయం వెళ్లాడు. విధులు ముగించుకుని ఇంటికి రాకపోవడంతో రాత్రంతా కుటుంబ సభ్యులు వెతికారు. శుక్రవారం ఉదయం కొత్తూరు చెరువులో ఆయన మృతదేహం లభ్యమైంది.

పురుగుల మందు తాగి వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి-రామభద్రపురం

పురుగుమందును మద్యంగా భావించి జన్నివలస గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ ప్రసాదరావు కథనం ప్రకారం.. జన్నివలసకు చెందిన వత్తిగుళ్ల రామకృష్ణ (42) రామభద్రపురంలో సిమెంట్ గోదాంలో కళాసీగా పనిచేస్తున్నాడు. గత నెల 29న మద్యం సీసా కొనుగోలు చేసుకొని ఇంటికి వెళ్లాడు. పత్తి చేనులో పిచికారీ చేసేందుకు పురుగుల మందు తెచ్చి, మద్యం సీసా పక్కన ఉంచాడు. దానినే మద్యంగా భ్రమించి పురుగు మందు తాగేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను వెంటనే బంధువులు సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి రామకృష్ణ మృతి చెందాడు. ఆయన భార్య సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన యువకుడు మృతి

ప్రజాశక్తి-బాడంగి

బొబ్బిలి మండలం కునుకువానివలస వద్ద వేగావతి నదిలో బుధవారం గల్లంతైన యువకుడు పి.యోగేశ్ (24) మరణించాడు. బాడంగి మండలం పాల్తేరు వద్ద తోటపల్లి కాలువ సమీపంలో గురువారం ఆ యువకుడి మృతదేహం లభ్యమైంది. బొబ్బిలికి చెందిన భవాని మాలధారి యోగేశ్.. వేగావతి నదిలో స్నానానికి దిగాడు. నదిలో నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. పాల్తేరు సమీపంలో మృతదేహాన్ని బాడంగి పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. యోగేశ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెందిన వంజరాపు సుబ్బినాయుడు (57) శుక్రవారం తెల్లవారి బహిర్భూమికి వెళ్తుండగా గుర్తు తెలయని వాహనం ఢీకొని మృత్యువాత పడ్డాడు. అటుగా వెళ్లిన స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రేగిడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం రాజాం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. సుబ్బినాయుడుకు భార్య, పిల్లలు ఉన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరం మండలం బియ్యాలపేటలో ప్రమాదవశాత్తు బావిలో పడి చుక్క ఈశ్వరరావు(37) మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. బియ్యాల పేట గ్రామానికి చెందిన చుక్క ఈశ్వరరావు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం బావిలో ప్రమాదవశాత్తు పడి పోయాడు. శుక్రవారం బావిలో మృతదేహం తేలియాడడంతో స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారు. అతని భార్య అప్పయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు విజయనగరం రూరల్ ఎస్ఐ వి అశోక్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృత్యువాత

కంటోన్మెంట్ : నగరంలోని కాటవీధిలో విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి చెందాడు. టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. లంకలపల్లి వెంకటేశ్వరరావు (41) కాట వీధిలో వెల్డింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. దసరా రోజు షాపులో పూజలు చేశాడు. అనంతరం ఇంటికి వెళ్లి సాయంత్రం షాపును తెరుస్తుండగా విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చూసి 108కు సమాచారం అందించడంతో జిల్లా ప్రభుత్వ సర్వ జనఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎస్ఎంఇ పార్కుతో ఉద్యోగావకాశాలు


ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎంఎస్ఎంఇ పార్కులతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆలుగుబిల్లి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రీసర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. మండలానికి ఎంఎస్ఎంఇ పార్కు వచ్చేలా చూడాలని ఆలుగుబిల్లి యువత కోరినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటైతే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. మూలబొడ్డవర, కొత్తూరు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వే గ్రామసభల్లో తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి సోమేశ్వరరావు, సర్పంచ్ మీనాకుమారి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాబోయే రోజుల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పక్షాలు భాగస్వాములు కావాలని తహశీల్దార్ కె.శ్రీకాంత్ కోరారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లో వసతులు, అవసరమైన మార్పులు, చేర్పులు, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను త్వరితగతిన పంపించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాథరావు, టిడిపి నాయకులు గేదెల రాజారావు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, సిపిఐ నాయకులు మొయిద పాపారావు, సిబ్బంది సత్తిబాబు, భాస్కరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీకాంత్

నామినేటెడ్ పదవుల్లో దళితులకు అన్యాయం

సామాజిక న్యాయ ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ గంటాన


ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రభుత్వం చేపడుతున్న నామినేటెడ్ పదవుల్లో దళితులకు అన్యాయం జరుగుతోందని సామాజిక న్యాయ ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ గంటా నప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నామినేటెడ్ పదవులకు సైతం దళితులు దూరమవుతున్నారని చెప్పారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఎండోమెంట్ పరిధిలోకి వెళ్లినప్పటి నుంచి నేటి వరకు ఆలయ కమిటీ చైర్మన్‌గా దళితులను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. ఆలయ చరిత్ర ప్రకారం అమ్మవారికి నిత్య పూజలు చేసే అడ్డూరు వంశీయులలో కనీసం ఏ ఒక్కరికీ చైర్మన్ పదవిని ఇవ్వలేదని ఆరోపించారు. నామినేటెడ్ పదవుల భర్తీలో కులవ్యవస్థ ప్రదర్శించడం సరైన పద్ధతి కాదన్నారు.

ఆక్రమణలను తొలగించాలి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన పశువుల శాలలను తొలగించాలని తహశీల్దార్ నీలకంఠేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నీలావతి గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరంబోకు భూమిని 19 మంది రైతులు ఆక్రమించి, పశువుల శాలలను నిర్మించారని తెలిపారు. వీటిని తొలగించాలని రెండు నెలల క్రితం ఫారం -7, 6 నోటీసులను జారీ చేసినట్లు తెలిపారు. ఆ భూమిలో ఎన్ని సంవత్సరాలు అనుభవంలో ఉన్నా హక్కులు రావని స్పష్టంచేశారు. చట్టాన్ని గౌరవించి ఆక్రమణలను తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి వి.నరసింహమూర్తి, గ్రామ నాయకులు లక్ష్మీపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ నీలకంఠేశ్వర్

బెల్ట్‌షాపుపై దాడి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఐటిఐ కాలనీలో బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి 19 మద్యం సీసాలను సీజ్ చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ కొండలరావు దాడులు చేపట్టారు. మద్యం వ్యాపారి పి.సత్యనారాయణను కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.